

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

నరసన్నపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్ తర్వాత ఐఐటీ, ఎన్ఐటీల్లో చేరేందుకుగాను జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలు బుధవారం నుంచి ఈ నెల 30 వరకు జిల్లాలో జరుగనున్నాయి. నరసన్నపేటలో కోర్ టెక్నాలజీ కేంద్రంలో ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 వరకూ, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకూ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారు. ఒక్కో షిఫ్ట్‌లో 297 మంది పరీక్ష రాయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రెండు గంటల ముందు చేరుకోవాలి. పరీక్షా సమయానికి అరగంట ముందువరకు కేంద్రంలోకి అనుమతిస్తారు.



లక్ష్మీ మిట్టల్‌ను కలిసిన సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ తదితరులు

పోర్టులో పెట్టుబడులకు ఆహ్వానం

- దావోస్‌లో మిట్టల్ గ్రూప్ చైర్మన్‌తో

సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ భేటీ


టెక్కలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ప్రాంతాన్ని పెట్రో కెమికల్ హబ్‌గా మార్చేందుకు పెట్టుబడులు పెట్టాలని సీఎం చంద్రబాబు, రాష్ట్ర ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖ మంతి నారా లోకేశ్ మిట్టల్ గ్రూప్ చైర్మన్ లక్ష్మి మిట్టల్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం దావోస్‌లోని బెల్వేడార్‌లో మిట్టల్ గ్రూప్ చైర్మన్‌తో సమావేశమయ్యారు. భావనపాడు, మూలపేట ప్రాంతంలో 826.51 ఎకరాల్లో రూ.4,361.91 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మిస్తున్నామని వారు తెలిపారు. ఈ ప్రాంతంలో ఆర్అండ్‌డీ లాజిస్టిక్ సౌకర్యాలను నెలకొల్పడానికి పెట్రో కెమికల్స్ గ్రీన్‌ఎనర్జీలో నూతన ఆవిష్కరణలకు అవకాశాలు ఉన్నాయని వివరించారు. హెచ్‌పీసీఎల్-మిట్టల్ సంయుక్త భాగస్వామ్య సంస్థ హెచ్ఎంఈఎల్-హెచ్‌పీసీఎల్ మిట్టల్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యాన రూ.3,500కోట్లతో భారత్‌లో ఏర్పాటు చేయాలని భావిస్తున్న 2జీడబ్ల్యూ సామర్థ్యం గల సోలార్ సెల్ తయారీ ప్లాంట్ ఇక్కడ నెలకొల్పాలని కోరారు. ప్రభుత్వం తరపున సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ ప్రతిపాదనపై మిట్టల్ సానుకూలంగా స్పందించారు. భేటీలో మిట్టల్ గ్రూప్‌నకు చెందిన ఆదిత్య మిట్టల్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే మూలపేట పోర్టు నిర్మాణ ప్రాంతంలో సుమారు ఆరువేల ఎకరాల్లో రూ.1.20కోట్ల యూఎస్ మిలియన్ డాలర్లతో కోల్‌కత్తాకు చెందిన హల్దియా పెట్రో కెమికల్స్ దృష్టి సారించింది.



మూలపేట పోర్టు పనులు..

అంకితభావంతో పని చేయండి

- పేకాట నిర్వాహకులపై చర్యలు: ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఆశ్రయించే బాధితులకు న్యాయం చేసే దిశగా ప్రతీ ఒక్క పోలీసు అధికారి విధులు నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. 'జిల్లాలో పలు పోలీసుస్టేషన్ల పరిధిలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో 'మీ కోసం' వేదికగా సమస్యలను తెలిపేందుకు బాధితులు తరచూ వస్తున్నారు. ఇకపై ఇటువంటి ఫిర్యాదులు నా దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని స్పష్టం చేశారు. 'జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి. సైబర్ నేరాల అడ్డుకట్టకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పేకాట నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. అనుమానం ఉన్న ప్రతీ ఒక్కరిపై బైండోవర్ కేసులు పెట్టాల'ని ఎస్పీ ఆదేశించారు. ఇటీవల మెళియాపుట్టి - ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పేకాట నిర్వాహణ, శ్రీకాకుళంలో రూ.11లక్షలతో పేకాట రాయుళ్ల పట్టుబడటం వంటి విషయాలపై చర్చించారు. జైలు నుంచి విడుదలైన నేరస్థులు, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ ఉన్న వ్యక్తుల నడవడికపై నిఘా ఉంచాలన్నారు. విజబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పలు కేసుల్లో ప్రతిభ చూపిన సీఐలు పైడపునాయుడు, ప్రసాదరావు, సత్యనారాయణతోపాటు పలువురిని అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, డీఎస్ ఆర్వీఎస్ఎన్ మూర్తి, ప్రసాదరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్.. చంపేస్తోంది!



కొత్తమారడికోట గ్రామం ఇదే..

- జిల్లాలోని 102 గ్రామాల్లో ప్రభావం
- కూటమి ప్రభుత్వం సర్వే ద్వారా గుర్తింపు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- నివారణకు చర్యలు చేపట్టాలని వేడుకోలు

మెళియాపుట్టి మండలం కొత్తమారడికోట గ్రామంలో 120 కుటుంబాలు ఉన్నాయి. సుమారు 350 మంది నివసిస్తున్నారు. ఇక్కడి తాగునీటిలో ఫ్లోరైడ్ ప్రభావం కారణంగా చాలామంది కిడ్నీవ్యాధి బారిన పడుతున్నారు. ఈక్రమంలో కొంతమంది ప్రాణాలు కోల్పోతుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి.. తాగునీరు సరఫరా చేయాలని అధికారులు, పాలకులను కోరుతున్నా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాగా.. ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన సర్వేలో.. జిల్లాలోని 102 గ్రామాల్లో ఫ్లోరైడ్ ప్రభావం ఉన్నట్టు గుర్తించడంతో ఆయా ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఫ్లోరైడ్ నివారణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మెళియాపుట్టి, జనవరి 21(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో చాలా గ్రామాల్లో ఫ్లోరైడ్ ప్రభావంతో ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటిలో మోతాదుకి మించి ఫ్లోరైడ్ ఉండడంతో పలు వ్యాదుల బారిన పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఫ్లోరైడ్ గ్రామాలపై దృష్టి సారించలేదు. ఆర్వో ప్లాంట్లు ఏర్పాట్లు చేయాలని, రక్షిత నీటిని సరఫరా చేయాలని ఆయా గ్రామస్థులు కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత ఫ్లోరైడ్‌పై రాష్ట్ర వ్యాప్తంగా అధి కారులు సర్వే నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలోని 24 మండలాల్లో 102 గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉన్నట్టు గుర్తించారు. అధికంగా వ్యాదులతో బాధపడుతున్న ప్రజలతోపాటు పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రక్త పరీక్షలు చేశారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి పరీక్షలు చేసి ఫ్లోరైడ్ సమస్య ఉన్నట్టు గుర్తించారు. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్, నైట్రైడ్ ఐరన్, ఆర్గానిక్ లాంటి రసాయన అవశేషాలు నిర్దేశిత పరిమితికి మించి ఉంటే ఫ్లోరోసిస్, కేన్సర్, కిడ్నీ, చర్మ, ఇతర వ్యాదుల బారినపడే పడే అవకాశం ఉంది. ఫ్లోరైడ్ ప్రభావం ఉన్న గ్రామాల్లో చాలామంది దేహంపై మచ్చలు కనిపిస్తున్నాయి. మోకాళ్లు, నడుము

(మిగతా 6వ పేజీలో..)



కొత్తమారడికోటలో రక్షిత నీటి పథకం

జల్‌జీవన్ నిధులు పక్కదారి..

ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా సురక్షిత నీటిని సరఫరా చేస్తే ఫ్లోరైడ్ సమస్య తగ్గుతుందని భావించింది. ఈ మేరకు నిధులు మంజూరు చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. వైసీపీ ప్రజాప్రతినిధులు అప్పట్లో తమకు అనుకూలమైన వ్యక్తులకు జల్‌జీవన్ పనులు పనులు అప్పగించారు. పనులు చేయకుండానే కొంతమందికి బిల్లులు మంజూరు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడా సురక్షిత నీరు సరఫరా కాకపోవడంతో ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం చెప్పినా..

వైసీపీ హయాంలో కేంద్ర జలశక్తి బృందం.. ఫ్లోరైడ్ గ్రామాల్లో సర్వే చేసింది. భూగర్భ జలాల వార్షిక నా ణ్యతను పరిశీలించింది. బోరు బావులు, రక్షితనీటి పథకాలు, ఆర్వోప్లాంట్‌లు, బావులు, బోర్లలో నీటి న మునాలు సేకరించింది. వాటికి పరీక్షలు నిర్వహించి.. ఫ్లోరైడ్ ప్రభావం అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి.. రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందజేసింది. ఆయా గ్రామాల్లో సురక్షిత నీటి సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించినా.. గత వైసీపీ ప్రభు త్వం పట్టించుకోలేదు. దీంతో ఫ్లోరైడ్ గ్రామాల్లో వ్యాధులు పెరుగుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఫ్లోరైడ్ నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా తేజేశ్వరరావు

గుజరాతీపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సిరిపురం తేజేశ్వరరావును ఎన్నుకున్నారు. శ్రీకాకుళం టౌన్‌హాల్ వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బీజేపీ నాయకులు సమావేశమై నూతన అధ్యక్షుడిని ప్రకటించారు. ప్రస్తుత అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావుతో పాటు మరికొందరు అధ్యక్ష పదవికి నామినేషన్లు వేశారు. కాగా కొత్తవారికి చోటు కల్పించాలన్న ఉద్దేశంతో అధిష్ఠానం తేజేశ్వరరావు పేరును ఖరారు చేసినట్లు బీజేపీకి చెందిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలియజేశారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశం అనంతరం స్థానిక టౌన్‌హాల్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పాతపట్నం మండలం సరాళి గ్రామానికి చెందిన తేజేశ్వరరావు.. గుజరాత్ రాష్ట్రంలో ఒకప్పుడు ఉద్యోగం చేసేవారు. కొన్నాళ్ల కిందట ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులుగా సుహాసిని ఆనంద్, బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు, సంపతిరావు నాగేశ్వరరావు, కాశీ విశ్వనాథం, చల్లా వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, పక్కన తేజేశ్వరరావు తదితరులు



ఢిల్లీరావు (ఫైల్)

కౌలురైతు అనుమానాస్పద మృతి

- పొలంలో విద్యుత్ తీగలు తగిలి..
- ఢిల్లీరావు మృతిపై అనుమానాలున్నాయని భార్య ఫిర్యాదు

8లో

ఆ ముగ్గురు

- వ్యాయామ ఉపాధ్యాయులుగా అక్కాచెల్లెళ్లు
- పేదింట విద్యా కుసుమాలు
- క్రీడల్లో రాణించి.. ఆపై ప్రభుత్వ కొలువులు
- భర్తలవీ అవే ఉద్యోగాలు

6లో

24న ఫార్మసీలో సీట్ల భర్తీకి అడ్మిషన్లు

ఎచ్చెర్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో డి.ఫార్మసీ కోర్సులో 2024-25 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 24న స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి.విక్టర్‌పాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ ఉత్తీర్ణులై ఆసక్తి గల విద్యార్థినులు అన్ని ఒరిజనల్ ధ్రువపత్రాలు, మూడుసెట్ల జిరాక్స్ కాపీలతో ఆ రోజు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం ఉంటుందని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ఫీజుతో కలిపి ఓసీ, బీసీ విద్యార్థినులు రూ.6,300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు రూ.5,700 చెల్లించాలని సూచించారు.

ధర సరే.. దిగుబడే!

- కొబ్బరిపై వరుస తుఫాన్ల దెబ్బ
- వెంటాడుతున్న తెగుళ్ల బెడద
- ఆశించినస్థాయిలో కానరాని పంట
- నష్టాల బాటలో రైతులు



తుఫాన్‌లో దెబ్బతిన్న కొబ్బరితోట (ఫైల్)

కవిటి మండలం చండిపుట్టుగకు చెందిన బి.రాజేష్ అనే రైతుకు నాలుగు ఎకరాలు కొబ్బరితోట ఉంది. వాతావరణం అనుకూలిస్తే రెండు నెలల వ్యవధిలో రెండువేల కాయలు వరకు దిగుబడి వచ్చేవి. కానీ ప్రస్తుతం 500 కాయలు మాత్రమే దిగుబడి వచ్చాయి. మార్కెట్‌లో కొబ్బరికాయలకు ధర పెరిగినా.. ఆశించినస్థాయిలో దిగుబడి లేదని రాజేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఉద్దానంలో చాలామంది రైతులది ఇదే పరిస్థితి.

కవిటి, జనవరి 21(ఆంధ్రజ్యోతి):

ఉద్దానంలో కొబ్బరి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏటా ప్రకృతి వైపరీత్యాలు, తుఫాన్ల ప్రభావంతో కొబ్బరి పంట దిగుబడి తగ్గుతోంది. మార్కెట్‌లో కొబ్బరికాయల ధర పెరిగినా.. అందుకు తగ్గ దిగుబడులు లేక తమకు నష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని ఉద్దానం ప్రాంతంగా పిలిచే కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు మండలాల 32వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు ఉన్నాయి. ఒకప్పుడు రైతులకు ఇవే ప్రధాన ఆదాయ వనరులుగా నిలిచేవి. 2018లో తితలీ తుఫాన్ దెబ్బకు కొబ్బరి పంట తుడిచిపెట్టుకుపోయింది. వేలాది చెట్లు నేలకొరిగాయి. అనంతరం చీడపీడలు సోకి.. పంట నామరూపమే మార్చేసింది. ఇప్పటికీ ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి పంట కోలుకోలేదు. గత రెండేళ్లుగా తీవ్ర వర్షాభావంతో కొబ్బరి చెట్ల నుంచి దిగుబడి తగ్గుముఖం పడుతోంది. ఒకప్పుడు ఎకరాకు రెండు నెలల వ్యవధిలో 500 కాయల వరకు దిగుబడి రాగా.. ప్రస్తుతం వంద కాయలు కూడా రాని పరిస్థితి నెలకొంది. అలాగే కంచిలి, కవిటి ప్రాంతాల్లో నల్లముట్టి, తెల్లదోమ తెగుళ్ల ఉధృతమయ్యాయి. తెగుళ్లతో పాటు కొమ్ముపురుగు,



కాండంతొలుచు పురుగులు ఆశించి నాటిన మొక్కలను నాశనం చేస్తున్నాయి. దీంతో కొబ్బరి రైతుల పరిస్థితి దారుణంగా మారింది. చెట్టు నుంచి కాయలు దించేందుకు అవసరమయ్యే కూలీ ఖర్చులు కూడా

(మిగతా 6వ పేజీలో..)

ఆ ముగ్గురు..



విద్యార్థులకు వాలీబాల్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

- వ్యాయామ ఉపాధ్యాయులుగా అక్కాచెల్లెళ్లు
- పేదింట విద్యా కుసుమాలు
- క్రీడల్లో రాణించి.. ఆపై ప్రభుత్వ కొలువులు
- భర్తలవీ అవే ఉద్యోగాలు

రణస్థలం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి)

పట్టుదల... కృషి.. సాధించాలనే తపన.. ఈ మూడూ ఒక్కచోట ఉంటే... అనుకున్న లక్ష్యాలకు చేరుకోవడం కష్టం కాదని నిరూపించారా అక్కాచెల్లెళ్లు. ముగ్గురూ ఉపాధ్యాయ కొలువులు సాధించడం... అది కూడా వ్యాయామ ఉపాధ్యాయులుగానే పని చేస్తుండడం విశేషం. వీరి తండ్రి సాధారణ ఆర్టీసీ డ్రైవర్. తండ్రి కష్టాన్ని గుర్తించి... అందుకు తగ్గట్టుగా కష్టపడి... అనుకున్నది సాధించారా అమ్మాయిలు. ఈ ముగ్గరి భర్తలూ వేర్వేరు చోట్ల వ్యాయామ ఉపాధ్యాయులుగానే పని చేస్తుండడం గమనార్హం. వివరాల్లోకి వెళితే... శ్రీకాకుళం నగరానికి చెందిన కోల గురుమూర్తి సాధారణ ఆర్టీసీ డ్రైవర్. ఆయన భార్య సూర్యకుమారి. వీరికి సుశీల, విజయలక్ష్మి, లక్ష్మి అనే ముగ్గురు కుమార్తెలతో పాటు ఒక కుమారుడు ఉన్నారు. అత్తెసరు జీతం...ఆపై పట్టణ జీవితం కావడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంది. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన ముగ్గురు కుమార్తెలు క్రీడలపై దృష్టి పెట్టారు. క్రీడల్లో రాణించి... వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఆ తరువాత ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో ఉత్తీర్ణత సాధించి... ప్రభుత్వ కొలువులు సాధించారు. కుమారుడు మాత్రం ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.



క్రీడల్లో పాల్గొన్న పీడీ సుశీల

వ్యాయామ ఉపాధ్యాయులుగా...

ప్రస్తుతం రణస్థలం, లావేరు ప్రాంతాల్లోనే ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లు పని చేస్తున్నారు. పెద్ద కుమార్తె సుశీల పాతర్లపల్లిలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమె భర్త శ్రీరాములు విశాఖపట్నంలోని నేవీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉన్నారు. రెండో కుమార్తె విజయలక్ష్మి లావేరు మండలం మెట్టవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమె భర్త నిర్మల కృష్ణ రాగోలు ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్. ఇక చిన్న కుమార్తె లక్ష్మి కోష్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త వెంకటేష్ విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఇటీవల ఆ ముగ్గురు అక్కాచెల్లెళ్ల ప్రతిభను గురించి తెలుసుకున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వారిని అభినందించారు. వీరు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని కొనియాడారు.

ఆమె చూపిన మార్గంలో...

గురుమూర్తి పెద్ద కుమార్తె సుశీలకు చిన్ననాటి నుంచి క్రీడలపై మక్కువ. అదే ఆ కుటుంబ దశను మార్చింది. చిన్నప్పటి నుంచి వాలీబాల్‌లో రాణించాలని ఎక్కువగా ఉండేది. అందుకే ఎక్కడ క్రీడా పోటీలు జరిగినా పాల్గొనేది. తల్లిదండ్రులు సైతం ప్రోత్సహించారు. దీంతో జాతీయస్థాయిలో వాలీబాల్ పోటీల్లో రాణించారు. ఒకవైపు క్రీడా పోటీల్లో పాల్గొంటూనే.. మరోవైపు పీఈటీగా శిక్షణ పొందారు. ఉపాధ్యాయురాలయ్యారు. విజయలక్ష్మి హ్యాండ్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించారు. అక్క మాదిరిగానే పీఈటీ శిక్షణ పూర్తి చేసి వ్యాయామ ఉపాధ్యాయురాలయ్యారు. లక్ష్మి కూడా అక్కలిద్దరినీ స్ఫూర్తిగా తీసుకొని క్రీడలపై దృష్టి పెట్టింది. క్రీడల్లో రాణించి పీఈటీ శిక్షణ పూర్తి చేసుకుంది. ఆమె కూడా వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం కుటుంబాలతో పాటు తల్లిదండ్రులను చక్కగా చూసుకుంటున్న అక్కాచెల్లెళ్లు మిగిలిన వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్నా..



మా కుటుంబ పరిస్థితి నాకు తెలుసు. నాన్న ఆర్టీసీలో చిరుద్యోగి. నలుగురు పిల్లలను చదివించడం చాలా కష్టం. అందుకే అప్పుడే నా దృష్టి క్రీడల వైపు మళ్లింది. ఆడపిల్లకు ఆటలేమిటి అని నిరుత్సాహపరిచిన వారూ ఉన్నారు. కానీ నేను ఏవీ పట్టించు కోలేదు. క్రీడా పోటీల్లో పాల్గొంటూనే పీఈటీ శిక్షణ తీసుకున్నా. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. ఇప్పుడు నా శిష్యులలో అనేక మంది పోలీసు, ఆర్మీలో పని చేస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

-కోల సుశీల

అక్క స్ఫూర్తితోనే...



మా అక్కే మాకు స్ఫూర్తి. అక్క క్రీడల్లో పడిన తపన చూశాం. మాకు క్రీడల పట్ల ఆసక్తి పెరిగింది. అదో వ్యసనంలా మారిపోయింది. క్రీడా పోటీల్లో పాల్గొంటూనే పీఈటీ శిక్షణ పూర్తిచేశాం. వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను సాధించాం. నిత్యం పిల్లల మధ్య గడపడం చాలా ఆనందంగా ఉంది.

- కోల విజయలక్ష్మి

చాలా ఇబ్బందులు పడ్డాం..



చదువుకున్న రోజులలో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాం. అక్క సుశీల మా ఇంటికి పెద్ద దిక్కు. అక్క వాలీబాల్, హ్యాండ్‌బాల్‌లో జాతీయ స్థాయిలో 18 బంగారు, రజత పతకాలు సాధించింది. ఆమె మాకు ఆదర్శం. నేను కబడ్డీలో జాతీయ స్థాయిలో బంగారు, రజతం కలిపి 9 పతకాలు సాధించాను.

-కోల లక్ష్మి



శ్యామసుందరునికి కిరణ స్పర్శ

టెక్కలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ తొలుసూరుపల్లి రోడ్డులో గల శ్యామసుందర స్వామిని మంగళవారం సూర్యకిరణాలు తాకాయి. ఈ ఏడాదిలో మూడోసారి స్వామి వారికి సూర్యకిరణాలు తాకడం విశేషం. శ్యామసుందర స్వామికి ఏటా ఇలా సూర్యకిరణాలు తాకుతుంటాయని అర్చకులు పద్మనాభ పండా తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

24న 'సుకన్య సమృద్ధి యోజన' మేళా

అరసవల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం తపాలా డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 24న 'సుకన్య సమృద్ధి యోజన' మేళాను నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖాతాలు తెరిచేందుకు వీలుగా ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేళాలో 3,500 సుకన్య సమృద్ధి ఖాతాలు ప్రారంభించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. 10 సంవత్సరాల లోపు బాలికలు ఈ ఖాతాను తెరవవచ్చని, 18 ఏళ్లు నిండితే ఉన్నత విద్య కోసం ఉన్న మొత్తంలో 50 శాతం విత్‌డ్రా చేసుకోవచ్చని తెలిపారు. వివాహానికి నెల రోజుల ముందు గానీ లేదా వివాహానంతరం మూడు నెలల లోపు పథకాన్ని ఉపసంహరించుకునేందుకు సదుపాయం ఉందని తెలిపారు. ఒక ఆర్థిక సంవత్సరానికి కనీసం రూ.250 నుంచి గరిష్ఠంగా రూ. 1,50,000 వరకు చెల్లించవచ్చన్నారు. దీనికి పన్ను మినహాయింపు ఉంటుందని ఆయన వివరించారు. ఖాతాను ఏ తపాలా కార్యాలయానికైనా బదిలీ చేయవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు దగ్గరలోని తపాలా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

వైమానిక దళంలో ఉద్యోగాలకు ర్యాలీ

అరసవల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారత వైమానిక దళంలో ఎయిర్‌మెన్-మెడికల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. 14 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్, కొచ్చి (కేరళ)లో ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బయాలజీతో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి, 18 నుంచి 20 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు ఫిబ్రవరి 1వ తేదీన హాజరు కావలసి ఉంటుందన్నారు. డిప్లొమా/బీఎస్సీ ఫార్మసీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, 18 నుంచి 23 సంవత్సరాల మధ్య గల అభ్యర్థులు ఫిబ్రవరి 4న నిర్వహించే ర్యాలీకి హాజరు కావాలని సూచించారు. వివరాలకు ఎయిర్‌మెన్ సెలక్షన్.సిడాక్.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.



సగం వరకు కోతకు గురైన సింగూరు రోడ్డు

ప్రమాదకరంగా సింగూరు రోడ్డు

పొందూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సింగూరు రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రెల్లిగెడ్డ ఉధృతికి సింగూరు రోడ్డు సగం వరకు కోతకు గురైంది. దీంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూడా కూలిపోయింది. ఉన్న రహదారి సైతం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. అయినా సంబంధిత అధికారులు దీనికి మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించడం లేదు. రాత్రిపూట ఈ రోడ్డులో ప్రయాణం నరక యాతనే. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని సింగూరు గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు కోతకు గురవడంతో కూలిన విద్యుత్ స్తంభం

జూనియర్స్ అదరగొట్టారు

- జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

శ్రీకాకుళం స్పోర్ట్స్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. నాగపూర్ వేదికగా ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగిన 69వ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలురు ప్రథమ స్థానం, బాలికలు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి బాలుర టీమ్‌లో జి.లక్ష్మణ్ (ఎస్ఎంపురం), శిష్టు హేమంత్ కుమార్ (కుశాలపురం), బాలికల విభాగంలో సింగూరు నందిని (లింగాలపేట), ముంత గాయత్రి (ఎచ్చెర్ల) ఏపీ జట్టు విజయంలో కీలక భూమిక పోషించారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ సూర శ్రీనివాసరావు, అధ్యక్షులు కోత పూర్ణచంద్రరావు, కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు, ఎస్ఐ యానాల తారకేశ్వరరావు, బీహెచ్ అరుణ్ కుమార్, పి.అజయ్‌కుమార్, డీఎస్‌డీవో కె.శ్రీధర్, పీఈటీ, పీడీల సంఘ జిల్లా అధ్యక్షులు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, శిక్షకులు ఎం.మధుసూధన్‌రావు, కోడి మోహన్ క్రీడాకారులను అభినందించారు.



బహుమతులతో జిల్లా క్రీడాకారులు

ఫ్లోరైడ్.. చంపేస్తోంది!

(ఐదో పేజీ తరువాయి)

వంగకపోవడం, మెడ తిప్పలేకపోవడం వంటి ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాఖ సర్వే ఆధారంగా బాధితులకు నెక్, లాంబర్ బెల్ట్స్, వాకర్స్, వీల్‌చైర్స్, ఫోల్డబుల్ టాయిలెట్స్, ఇతర ఉపకరణాలు అందజేయనున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ద్వారా నీటి పరీక్షలు చేసి.. ఫ్లోరైడ్ ఉన్నట్లు నివేదిక వస్తే చర్యలు తీసుకుంటాం. మెళియాపుట్టి మండలం కొత్తమారడికోటలో ఆర్వో ప్లాంట్ ద్వారా తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేశాం.

-ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి

ధర సరే.. దిగుబడే!

(ఐదో పేజీ తరువాయి)

రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రత్యామ్నాయం కొంతమంది కొంతమంది అరకొర ఆదాయంతోనే జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో అప్పులపాలవుతున్నారు. మరికొంతమంది ఉపాధి కోసం వలసబాట పడుతున్నారు. ఇంకొందరు తమ తోటలను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వారు తోటలు చదును చేసి వెంచర్లు వేసి.. ప్లాట్లు విక్రయిస్తున్నారు. దీంతో కొబ్బరిసాగు కూడా తగ్గుముఖం పడుతోంది.

మార్కెట్ వెలవెల..

కొబ్బరికి కంచిలి ప్రధాన మార్కెట్‌గా పేరుగాంచింది. ఈ మార్కెట్ నుంచి ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, బీహార్ వంటి ప్రాంతాలకు నాణ్యమైన కొబ్బరి ఎగుమతి జరిగేది. 1999 పెను తుఫాన్ తర్వాత వ్యాపారం సన్నగిల్లింది. ఏటా వరుస తుఫాన్ల తాకిడితో దిగుబడి తగ్గడంతో మార్కెట్‌పై ప్రభావం చూపింది. తమిళనాడులో కొబ్బరి ఉత్పత్తి పెరగడంతో ఉత్తరాదికి ఇక్కడి నుంచి వెళ్లే ఎగుమతులు తగ్గాయి. గతంలో ఉద్దానంలో వెయ్యి కాయల ధర రూ.10వేల నుంచి రూ.15వేల లోపు ఉండేది. ప్రస్తుతం సుమారు రూ.22వేలు పలుకుతోంది. హోల్‌సేల్ మార్కెట్‌లో రిటైల్‌గా ఒక్కో కాయ రూ.30కు విక్రయిస్తున్నారు. కాగా.. ధర పెరిగినా.. కొబ్బరికాయల దిగుబడి తగ్గడంతో రైతులకు కన్నీరే మిగులుతోంది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కొబ్బరి రైతులు కోరుతున్నారు.

విద్య కోసం ఆస్తి దానం

- స్ఫూర్తిదాయకం పెంట గున్నయ్య త్యాగం



కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్ మైదానం



గున్నయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కుటుంబ సభ్యులు (ఫైల్)

పలాస, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్ జిల్లాలో అతి పెద్ద పాఠశాలగా పేరుగాంచింది. ఆరు ఎకరాల సువిశాల స్థలంలో ఉండే ఈ పాఠశాల వేలాది మంది విద్యావంతులను జాతికి అందించింది. ఈ పాఠశాల ఆవిర్భావం వెనుక ఓ వ్యక్తి త్యాగం ఉందన్న సంగతి చాలా మందికి తెలియదు. అప్పట్లో పలాస, కాశీబుగ్గ వేర్వేరు పంచాయతీలుగా ఉండేవి. పలాస విద్యాపరంగా అభివృద్ధి చెందినా... కాశీబుగ్గలో ఆ సౌకర్యాలు లేవు. దీన్ని గుర్తించిన అప్పటి చిరు వ్యాపారి పెంట గున్నయ్య ఇక్కడి పిల్లలకు కూడా విద్యను అందించాలనే సదుద్దేశంతో పట్టణ నడిబొడ్డున బస్టాండుకు కూతవేటు దూరంలో ఆరు ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. పాఠశాల నిర్మాణానికి 1960వ సంవత్సరంలో రూ.10 వేలు విరాళంగా ఇచ్చారని స్థానికులు చెబుతున్నారు. ఆయన స్ఫూర్తితో పాఠశాల నిర్మించగా... మిగిలిన స్థలం క్రీడలకు వినియోగించుకునే విధంగా ఖాళీగా ఉంచారు. రూ.కోట్ల విలువైన స్థలం ఇచ్చిన పెంట గున్నయ్యకు గుర్తుగా ఆయన మనమలు పాఠశాల ఆవరణలో కంచు విగ్రహాన్ని ఇటీవల ఏర్పాటు చేశారు. ఆయన పేరుమీద శాశ్వత విరాళాన్ని ఇచ్చి విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే కార్యక్రమం చేపడతామని ఆయన కుటుంబ సభ్యులు... ఉపాధ్యాయులు, విద్యార్థులకు హామీ ఇచ్చారు.

గర్వకారణం..



అప్పట్లో మా తాత గున్నయ్య ఇచ్చిన స్థలం ప్రస్తుత మార్కెట్‌లో రూ.వంద కోట్లు ఉంటుంది. అంతటి విలువైన స్థలం విద్యాభివృద్ధికి దానంగా ఇవ్వడం గర్వంగా ఉంది. స్థానిక పెద్దలు ముందుకు వస్తే ఈ ప్రాంతంలో కేజీ నుంచి పీజీ వరకూ ఉచితంగా ప్రభుత్వ విద్య అందే అవకాశం ఉంటుంది.

-పెంట ఉదయ్‌శంకర్, గున్నయ్య మనుమడు

వైసీపీ తీరుతోనే విశాఖ ఉక్కు నాశనం

కవిటి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ తీరుతోనే విశాఖ ఉక్కు పరిశ్రమను నాశనం చేశారని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ ఉక్కుపరిశ్రమను ప్రైవేటుపరం చేసి ఆస్తులను దోచుకోవాలని వైసీపీ నాయకులు విఫలయత్నం చేశారని ఆరోపించారు. జగన్‌రెడ్డి తన కేసుల నుంచి విముక్తి కల్పించుకోవాలని, రాష్ట్రాన్ని తాకట్టుపెడతానని యత్నించాడే తప్ప విశాఖ ఉక్కుపరిశ్రమను మెరుగుపర్చాలనే ప్రయత్నం చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖ ఉక్కును పరిరక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నించి కేంద్రం నుంచి రూ.11,440కోట్లు ప్యాకేజీని ఇచ్చేందుకు ఆమోదం వేసిందన్నారు. 1994లో కాంగ్రెస్ ప్రభుత్వం నష్టాలపేరుతో ప్లాంట్‌ను అమ్మకానికి ప్రయత్నిస్తే నాటి ఎంపీ ఎర్రన్నాయుడు నేతృత్వంలో టీడీపీ ఎంపీలు పోరాటం చేయడంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం వెనక్కితగ్గిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఉక్కు పరిశ్రమను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే వైసీపీ నేతలు ఎన్డీఏపై విమర్శలు చేయడం తగదన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధులు

ఆమదాలవలస, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో 22 రహదారుల నిర్మాణానికి రూ.349.65 లక్షలు కూటమి ప్రభుత్వం మంజూరు చేసినట్టు స్థానిక టీడీపీ కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో రోడ్లు గుంతలు గోతులమయంగా మారి ప్రజా రవాణాకు తీవ్ర ఆటంకంగా మారిందని, ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయం కల్పించాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు విరివిగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఆర్ అండ్‌బీ మంత్రి జనార్ధన్ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ స్పీకర్ తమ్మినేని పరామర్శ

ఆమదాలవలస, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తమ్మయ్యపేట గ్రామానికి చెందిన కోట రమణ ఇటీవల గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. దీంతో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం ఆయన్ని పరామర్శించారు. ఈయన వెంట వైసీపీ జిల్లా అధికారి ప్రతినిధి కోట గోవిందరావు తదితరులు ఉన్నారు.

రేపు గణపతి సచ్చిదానంద స్వామి రాక

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గణపతి సచ్చిదానంద స్వామి ఈ నెల 23వ తేదీ గురువారం నగరంలో కొత్తబ్రిడ్జి వద్ద గల దత్తాత్రే స్వామి ఆలయాన్ని దర్శించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గణపతి హోమం, నూతన కళావేదిక ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. శుక్రవారం నాగావళి రాగసాగర దివ్యనాథగాన కచేరి ఉంటుందన్నారు. ఆయనతోపాటు దత్త విజయానంద స్వామి కూడా రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

కవిటి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు దృష్టిసారించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కవిటి మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాణిక్యపురం, లండారిపుట్టుగ, కపాసుకుద్ది, సహలాలపుట్టుగ, నెలవంక పంచాయతీలకు చెత్తసేకరణకు వాహనాలు మంజూరయ్యాయి. ఈవాహనాల ద్వారా చెత్తసేకరణ చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అశోక్ కోరారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, టీడీపీ నేతలు బి.చిన్నబాబు, బి.రమేష్, పి.కృష్ణారావు, బీమారావు రౌళో, మణిచంద్రప్రకాష్, ఎ.మధు, ఎస్వీ రమణ పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా



సాయిబాబుని సత్కరిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట

అరసవల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తూర్పుకాపు సంఘం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కా సాయిబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన తర్వాత తొలిసారిగా నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల టీడీపీ జిల్లా కార్యాల యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ ను ఆయన మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకు న్నారు. అందరిని కలుపుకుని వెళతానని, అందరూ సహకరించాలని ఈ సందర్భంగా కలమటను ఆయన కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనకు బాధ్యతలు అప్పగించినందుకు ఆయన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కలమట సాయిబాబునాయుడిని దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొందంకి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతి

సోంపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ మందిరంలో స్వామి వివేకానంద జయంతి (తిథి ప్రకారం) మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టోత్తర శతనామావళి, విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పఠనం, భక్తి గీతాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. గరుడచలం శంకరరావు, ఎం.వేణు, జి.రామకృష్ణ, ఎ.చంద్రశేఖర్, రిటైర్డు హెచ్ఎం టి.జోగారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేలో దశకోటి శ్రీరామనామ లిఖితం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మే నెల 4 నుంచి మూడు రోజులపాటు ఉపనిస్మందిరం ఆధ్వర్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో దశకోటి శ్రీరామ నామ లిఖితం, కోటి హనుమాన్ చాలీసా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సమావేశం నిర్వహించారు. పతంజలి శాస్త్రి, కామేశ్వరరావు, గుమ్మా నగేష్, ఆనందరావు, సంయుక్త, డాక్టర్ అమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారు. వీరి ఎంపికపై డీఈవో తిరుమల చైతన్య, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా పీఈటీ, పీడీ సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి టీవీ రమణ తదితరులు అభినందించారు.

హుకుంపేట రోడ్డుకు మోక్షం

- కూటమి ప్రభుత్వ చొరవతో సీసీ రహదారిగా మార్పు
- ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు



గతంలో రోడ్డు దుస్థితి



ప్రారంభానికి సిద్ధమైన హుకుంపేట రోడ్డు

గార, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఆ గ్రామస్థులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మోక్షం కలగడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాళ్లు తేలిపోయి కనీసం నడిచి వెళ్లడానికి కూడా ఇబ్బందిపడేవారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ రోడ్డు పనులు.. నిధులు కొరతతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ గతుకుల రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో ఈ రహదారి ముఖచిత్రం మారిపోయింది. వివరాల్లోకి వెళితే.. వమరవల్లి పంచాయతీ హుకుంపేట గ్రామానికి ప్రధాన రహదారి నుంచి సుమారు 1200 మీటర్లు పొడవునా పూర్తిగా శిథిలమైన రోడ్డు ఉంది. ఈ గ్రామంలో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నారు. అటు కళింగపట్నం, ఇటు శ్రీకాకుళం వెళ్లాలంటే ఈ రోడ్డుగుండానే పోవాల్సి ఉంటుంది. దీంతో వారంతా రాకపోక లకు తీవ్రంగా ఇబ్బందిపడేవారు. ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వం రూ.1.10 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు అందకపోవడంతో ఆ పనులు ఆపేసి వెళ్లిపోయారు. అటు తర్వాత గత ప్రభుత్వం ఈ రోడ్డు పనులు పూర్తి చేయకుండా నాన్‌ప్రయార్టీ కింద వదిలేసింది. దీంతో రాళ్లు తేలిపోయి గోతులు ఏర్పడి కనీసం రాకపోకలు కూడా చేయలేక ఇబ్బందిపడ్డారు.

రూపు మారిన రోడ్డు

ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ రోడ్డు దుస్థితిని ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి ఆ గ్రామస్థులు, పెద్దలు తీసుకురావడంతో ఆయన స్పందించారు. తక్షణమే ఈ రోడ్డు అభివృద్ధికి ఉపాధి పథకం ద్వారా రూ.64.50 లక్షలు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేయించారు. ఇటీవల ఈ రోడ్డు పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. దీంతో ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు అష్టకష్టాలు పడిన ఆ గ్రామస్థులు ఇప్పుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కుకు భరోసా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర మణిహారం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకోవడానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో గల తన కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో కేంద్ర ప్రభుత్వం రూ.11,400కోట్ల ప్యాకేజీని ప్రకటించిందన్నారు. విశాఖ ఉక్కుకు చంద్రబాబు పూర్తి భరోసా ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు వినే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింతు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తల్లిపాల కేంద్రం ఏర్పాటు

అరసవల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డీపీటీవో విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల ప్రత్యేక కేంద్రాన్ని ఆయన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాంతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో విస్తృత కేటాయింపులు జరుపుతోందన్నారు. కార్యక్రమంలో 1, 2 డిపోల మేనేజర్లు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బెందాళం ప్రకాష్ జయంతి



ప్రకాష్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్ తదితరులు

కవిటి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తండ్రి ప్రకాష్ జయంతి మంగళవారం ప్రగడపుట్టుగలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడపుట్టుగలోని కళావేదిక వద్దనున్న ప్రకాష్ విగ్రహానికి గ్రామస్థులు పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే రామయ్యపుట్టుగలో ప్రకాష్ ఘాట్ వద్ద ప్రభుత్వ విప్ అశోక్, టీడీపీ నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రాంగణ నియామకాల్లో 16 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థినుల ఆనందం

గుజరాతీపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎస్‌బీసీ కార్యాలయం సమీపంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం జరిగిన ఎన్‌టీఐ మైండ్ ట్రీ కంపెనీ నిర్వహించిన నియామకాల్లో 16 మంది విద్యార్థినులు రూ.3.2 లక్షల వార్షిక వేతనంతో కొలువులు సాధించినట్టు కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి సంవత్సరం డిగ్రీ నుంచే ఉద్యోగాలకు ఉపయోగపడే ట్రైనింగ్ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఎంతో ప్రాధాన్యం ఉన్న కోడింగ్‌పై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికైన విద్యార్థినులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయడు అభినందించారు.

బకాయిలు విడుదల చేయాలి



జేసీకి వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుజరాతీపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ కోరారు. మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. సరెండర్ లీవ్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఆర్సీ, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు ప్రాప్తికి 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను పాతపెన్షన్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సంఘ ప్రతినిధులు బి.రవికుమార్, చౌదరి రవీంద్ర, పి.సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లపై తప్పుడు ప్రచారం తగదు



మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

శ్రీకాకుళం క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లపై తప్పుడు ప్రచారాలు చేయడం తగదని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో మంగళవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండీయూ వ్యవస్థ వల్ల రేషన్ డీలర్లకు వచ్చే నష్టం ఏంటని ప్రశ్నించారు. నెల్లూరులో రేషన్ డీలర్ ఆత్మహత్య చేసుకోవడం వెనుక ఎండీయూ ఆపరేటర్‌లే కారణమనడం దారుణమన్నారు. నాలుగేళ్లుగా ఎండీయూ ఆపరేటర్లు చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ల సేవలను గుర్తించాలని ఆయన కోరారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు

అరసవల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా నేటికీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, ఎన్నికల హామీలను అమలులో భాగంగా ఇస్తామన్న మెగా డీఎస్సీ ఏమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ జిల్లా 23వ మహాసభ నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ వద్ద గల క్రాంతి భవన్‌లో మంగళవారం జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ అరుణ పతాకాన్ని ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేంద్రబాబు, యుగంధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు తమ పాదయాత్రలో లోకేష్, చంద్రబాబు ఇచ్చిన మెగా డీఎస్సీ హామీ నేటికీ ప్రకటించకపోవడం దారుణమన్నారు. అప్పులు చేసి కోచింగ్ తీసుకున్నవారు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని కోరారు. జిల్లాలో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోరు వాసుదేవరావు, కొన్న శ్రీనివాసరావు, సంతోష్, రాము, శ్యామ్, కర్ణవీరుడు, వెంకటరావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

లావేరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో వివేకానంద పర్యవేక్షణలో మంగళవారం సుభద్రాపురం, వెంకటాపురం, బుడుమూరు తదితర చోట్ల దుకాణాల్లో డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు చేపట్టారు. బుడుమూరు జంక్షన్‌లో వాహనాలను తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో జెఆర్ పురం సీఐ ఎం.అవతారం, లావేరు ఎస్ఐ లక్ష్మణరావు, ఏఎస్ఐలు భుజింగరావు, జగన్మోహన్‌రావు తదితర పోలీసులు పాల్గొన్నారు.

బాలికల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



కేక్‌కట్ చేస్తున్న బాలల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

అరసవల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి వారికి పూర్తి రక్షణ కల్పించే బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం ఈ నెల 24న దేశవ్యాప్తంగా జరుపుకోనున్న సందర్భంగా మంగళవారం ఆయన నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో చైల్డ్‌రైట్స్ అవేర్‌నెస్ ఫోరం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి, బాలల సంఘాల ప్రతినిధులు మెట్ట మల్లేశ్వరరావు, కొత్తకోట శ్రీనివాసరావు, వాసుదేవకుమార్, ప్రవీణ్, బాలకృష్ణ, మోహిని, మాధురి, కేంద్రం నిర్వాహకులు శేఖర్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.1.70 లక్షల సాయం



కుటుంబ సభ్యులకు సాయాన్ని అందిస్తున్న దాతలు

ఇచ్ఛాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ కటక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డొంకూరు గ్రామానికి చెందిన దున్న సమీరా వైద్య ఖర్చుల కోసం దాతలు ముందుకు వచ్చి సాయాన్ని అందించారు. అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సమీరా ఆరోగ్యం క్షీణించింది. ఆమె తల్లిదండ్రులు వైద్యులకు చూపించగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు నిర్ధారించారు. వైద్య ఖర్చుల కోసం సుమారుగా రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. పేద కుటుంబం కావడంతో ఆమె తల్లిదండ్రులు దాతలను ఆశ్రయించారు. స్పందించిన పలువురు దాతలు రూ1.70 లక్షలు ఆర్థిక సాయాన్ని సమీరా తల్లిదండ్రులు దున్న మోహనరావు, తరిణమ్మకు మంగళవారం అందజేశారు.

హౌసింగ్ లే అవుట్ పరిశీలన



సూచనలిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

ఎచ్చెర్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చిలకపాలెంలోని హౌసింగ్ లే అవుట్ అభివృద్ధి పనులను డ్వామా పీడీ బి.సుధాకరరావు మంగళవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అంతర్గత రహదారులు, లే అవుట్ అభివృద్ధి పనులను క్వాలిటీ కంట్రోల్ బృందంతో కలిసి పరిశీలించారు. ఈసీ నారాయణమ్మ, టీఏ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

- లావేరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పనుల్లో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ సుధాకరరావు అన్నారు. మంగళవారం పెదరావుపల్లి, మురపాక గ్రామాల్లో జరుగుతున్న మినీ గోకులాలు, రహదారి పనులను ఆయన తనిఖీ చేశారు. ఏపీవో సత్యవతి, జేఈ లెలిన్‌బాబు, టీఏ గౌరినాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నాటిక పోటీల్లో రెండు బహుమతులు



అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఆమదాలవలస, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఖరగ్‌పూర్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో ప్రవాసాంధ్ర నవ్య కళా పరిషత్ నిర్వహించిన అఖిల భారత స్థాయి నాటిక పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు కళాకారులకు బహుమతులు లభించాయి. కుప్పిలి వెంకట రాజారావు రచించి, దర్శకత్వం వహించిన పులికాలం నాటికలో విలన్ పాత్రలో నటించిన కుప్పిలి శ్యామలరావుకు ఉత్తమ విలన్ అవార్డు లభించగా, ఇదే నాటికలో నటిగా నటించిన ఎస్.దీపికకు ఉత్తమ నటిగా కన్సొలేషన్ బహుమతి లభించింది. సినీనటుడు నాగినీడు చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు.

అందుబాటులో నువ్వుల విత్తనాలు

సోంపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రం వద్ద రైతులకు కావాల్సిన నువ్వుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి.నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన వారు సోంపేట రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. రెండు కిలోల నువ్వుల విత్తనాలు రూ.210 అందిస్తున్నట్టు తెలిపారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

అరసవల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలో గల డీఎల్‌టీసీ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, ప్రభుత్వ ఐటీఐ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ఆమదాలవలస, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసాచార్యులపేటలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి మంగళవారం ప్రారంభించారు. శిబిరాన్ని జిల్లా సంయుక్త సంచాలకులు (జేడీ) కంచరాన రాజగోపాలరావు సందర్శించి రైతులతో మాట్లాడి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిబిరానికి జేడీతో పాటు సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశువైద్యశాల అధికారి రోణంకి ఆనందరావు, అక్కులపేట పశువైద్యాధికారి జి యతిరాజు హేమలత పాల్గొన్నారు.

ఆసుపత్రుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఇచ్ఛాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గల నాలుగు మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలు పరిష్కరించాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబును మాజీ సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం విజయవాడ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రంలో గల సీహెచ్‌సీలో వైద్యుల కొరత వేధిస్తుందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. బారువలో నాబార్డు నిధులతో కొత్తగా ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. డయాలసిస్ కేంద్రాల పనులు వేగవంతం చేయాలని కోరారు. చీఫ్ సెక్రటరీ సానుకూలంగా స్పందించారని శ్యాం ప్రసాద్ రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

చినబైపల్లిలో మహిళ ఆత్మహత్య



శాంతమ్మ మృతదేహం

వజ్రపుకొత్తూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చిన బైపల్లి జీడి తోటలో మహిళ తామాడ శాంతమ్మ (55) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాంతమ్మ జీడితోటలో ఓ చెట్టుకు నైలాన్ తాడుతో ఉరి వేసుకుంది. అయితే తాడు తెగిపోయి మృతదేహం కింద పడి ఉండడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. శాంతమ్మ భర్త తులసీదాస్ చాలా ఏళ్ల కిందట మృతి చెందారు. కుమారుడు హరికృష్ణ ప్రస్తుతం సీమెన్‌గా, కోడలు వేరే రాష్ట్రంలో ఉద్యోగం చేస్తున్నారు. దీంతో శాంతమ్మ ఒంటరిగానే బైపల్లి గ్రామంలో ఉంటోంది. ఏఎస్ఐ జూన్నా రావు ఘటనా స్థలానికి చేరు కొని పరిశీలించారు. శవపంచనామా నిర్వ హించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'వంశధార' రెగ్యులేటర్ సామగ్రి చోరీ

టెక్కలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమ కాలువ 55.728 కిలోమీటర్ వద్ద లక్షలు ఖరీదు చేసే నాలుగు డోర్లు, స్క్రూ రాడ్లు, గేర్‌బాక్స్‌లు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు వంశధార జేఈ పి.భాస్కరరావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెల్డింగ్ మిషన్‌తో డోర్లను కట్ చేయించి బరువున్న స్క్రూ రాడ్లను నీటిలో పడేసి గేర్ బాక్సులను దొంగలించినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రబీ పంటలకు సాగు నీటికి తీసుకువెళ్లేందుకు దిగువ ప్రాంత రైతులే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని పలువురు భావిస్తున్నారు. తొలిసారి ఈ తరహా ఘటన జరగడంపై వంశధార అధికారుల్లో సైతం ఆందోళన నెలకొంది.

బాలికపై యువకుడి అఘాయిత్యం

రణస్థలం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఒక యువకుడు అఘాయిత్యానికి పాల్పడినట్లు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆ బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యు లు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎన్.ప్రసాద్ అనే యువకుడు ఆదివారం సాయంత్రం ఆ బాలికను లోబరుచుకుని గ్రామ సమీపంలోని ప్రభుత్వ భవనంపైకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బయటకు చెపితే చంపేస్తానని బెదిరించాడు. ఆ బాలిక వ్యవహార శైలిలో మార్పులు రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఏం జరిగిందని గట్టిగా నిలదీయడంతో అసలు విషయాన్ని బయట పెట్టింది. వెంటనే కుటుంబ సభ్యులు జేఆర్ పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

మద్యం, సారా స్వాధీనం

కంచిలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న సారా, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్ఐ అప్పలరెడ్డి తెలిపారు. మంగళవారం తనిఖీలు చేస్తుండగా కుమ్మరిపేట వద్ద 10 మద్యం సీసాలతో సావు కారి కుమార్, మధుపురం వద్ద 300 సారా ప్యాకెట్లతో తలగాని లోకేశ్వరరావు పట్టుబడినట్టు తెలిపారు. మద్యం, సారాను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేశామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



కాలిబూడిదైన ఇంటివద్ద విలపిస్తున్న బాధిత కుటుంబసభ్యులు

పోలాకి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తలసముద్రం పంచాయతీ కొల్లివలసలో మంగళవారం నక్క బుజ్జికి చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఇంట్లోని సామగ్రితో పాటు రూ.25 వేల నగదు కాలి బూడిదయ్యాయి. ఉదయం పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లి పోయింది. అయితే ఇంట్లో నుంచి మంటలు వస్తున్న విషయం స్థానికులు తెలుపగా కుటుంబ సభ్యులు వచ్చే సరికి పూరిల్లు, ఇంటిలోని సామగ్రి బూడిదయ్యాయి. విషయాన్ని సచివాలయంలో బాధితులు ఫిర్యాదు చేశారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

బొడ్డపాడులో పూర్వ విద్యార్థుల కలయిక



2020-21 నాటి విద్యార్థుల ఆత్మీయ కలయిక

పలాసరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2020-21 సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంగళవారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందం పొందారు. అనంతరం నాడు విద్యను నేర్పిన గురువులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తామాడ సాయి, బొడ్డు రేవతీపతి, మద్దు లోహిత్, బొడ్డు ఆకాష్, తెప్పల కపిల్ తదితరులు పాల్గొన్నారు.

'తెప్పల'కు శ్రీశ్రీ కళావేదిక పురస్కారం

పలాసరూరల్,జనవరి21(ఆంధ్రజ్యోతి): విజయవాడ కౌతాపూర్ణానంద విలాస్ కళావేదికలో శ్రీశ్రీ కళావేదిక సంస్థ 143వ కార్యక్రమంలో పలాస జనజాగృతి సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు తెప్పల కృష్ణమూర్తి కవితాగానం చేశారు. ఈ సందర్భంగా భాషాసాహిత్యంపై ఆయనకు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో కళావేదిక సీఈవో డాక్టర్ కె.ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, దూరదర్శన్ డైరెక్టర్ కొండలరావు, ఉప డైరెక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు.

సీపీఎం నేత వీజీకే మూర్తి మృతి తీరని లోటు

టెక్కలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత వీజీకే మూర్తి మృతి జిల్లా ఉద్యోగ, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం నాయకుడు నంబూరు షణ్ముఖరావు అన్నారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కమిటీ తొలి అధ్యక్షుడిగా, సీపీఎం జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడిగా కార్మిక, ప్రజా ఉద్యమాల్లో వీజీకే మూర్తి పాలుపంచుకున్నారన్నారు. కార్యక్రమంలో కుప్పిలి కామేశ్వరరావు, పాలవలస ధర్మారావు, ఈశ్వరరావు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వీజీకే మూర్తి సంస్మరణ సభ నిర్వహిస్తున్న దృశ్యం

కౌలురైతు అనుమానాస్పద మృతి

- పొలంలో విద్యుత్ తీగలు తగిలి..
- ఢిల్లీరావు మృతిపై అనుమానాలున్నాయని భార్య ఫిర్యాదు

పలాస, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కౌలు చేసుకుని జీవనం సాగిస్తున్న తెప్పల ఢిల్లీరావు (57) రామకృష్ణాపురం పవర్‌గ్రిడ్ రోడ్డులో ఉన్న అదే పొలంలో విగతజీవిగా మారిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అయితే భర్త మృతిపై అనుమానాలున్నాయని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అందరితో కలివిడిగా, తలలో నాలుకగా ఉండే ఢిల్లీరావు పలాస మండలం నీలావతి గ్రామంలో భార్య, పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు నడుపుతూ మిగిలిన సమ యంలో కౌలుకు తీసుకున్న పొలం సాగుచేస్తూ ఆవులను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. రామకృష్ణాపురం గ్రామానికి సమీపంలో కౌలు భూములున్నాయి. వీటి విషయంలో కాశీబుగ్గకు చెందిన రియల్ ఎస్టేట్‌దారులు, ఓ వైద్యునితో ఢిల్లీరావుకు తగాదాలున్నాయి. ఈ వ్యవహారంపై మూడు పర్యాయాలు వారితో ప్రజాసంఘాల నాయకులు మధ్యవర్తిత్వం వహించినా వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఢిల్లీరావు ఇంటి నుంచి బైక్‌పై రామకృష్ణాపురం భూముల వద్దకు వెళ్లాడు. రాత్రి 9 గంటలైనా తిరిగి రాకపోవడంతో ఆయన భార్య ఫోన్ చేసినా స్పందించలేదు. ఈ విషయాన్ని ఆమె రామకృష్ణాపురంలో ఉంటున్న ఆయన బంధువు సౌర్ర ప్రశాంత్‌కు చెప్పడంతో ఆయన పొలాల్లో వెతుకుతుండగా మంటల్లో కాలిపోతున్న ఢిల్లీరావును గుర్తించాడు. పొలాలకు గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు అమర్చడంతో అవి తాకి మృతిచెందినట్లు సమాచారం అందించడంతో రాత్రి 11 గంటలకు గ్రామస్థుల సహకారంలో ఢిల్లీరావు మృతదేహాన్ని గుర్తుపట్టి పోలీసులకు సమాచారమిచ్చారు. ప్రశాంత్ ఢిల్లీరావును వెతికే క్రమంలో ఆ ప్రాంతంలో ఐదుగురు వ్యక్తులున్నారని, వారు అక్కడ నుంచి విద్యుత్ తీగలను తొలగించి పారిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. మంగళవారం వేకువజామున ఘటనా స్థలానికి కాశీబుగ్గ పోలీసులు చేరుకొని ఢిల్లీరావు మృతదేహానికి పలాస ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భర్త మృతిపై అనుమానాలున్నాయి..

తన భర్త ఢిల్లీరావు పొలంలో మృతి చెందాడని, పక్కనే విద్యుత్ తీగలు పెట్టడం వల్ల అవి తగిలి మృతి చెందాడని, భర్త మృతిపై తనకు అనుమానాలున్నాయని భార్య కమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి పోలీసు క్లూస్ టీమ్ సభ్యులు చేరుకుని వివరాలు సేకరించారు. విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నారు. భార్య కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జి.సంజీవరావు తెలిపారు. అయితే గ్రామస్థులు, ప్రజాసంఘాల నేతలు ఇది ముమ్మాటికీ హత్యేనని ఆరోపిస్తున్నారు.

ఇది ముమ్మాటికీ హత్యే: ప్రజాసంఘాలు

ఢిల్లీరావు మృతి చెందిన తీరు పరిశీలిస్తే ఇది ముమ్మాటికీ హత్యగానే కనిపిస్తోందని ప్రజాసంఘాల ప్రతినిధులు మద్దిల రామారావు, పత్రి దానేసు, వంకల మాధవరావు, సీనియర్ న్యాయవాది పిండి వెంకటరావు ఆరోపించారు. ఈ మేరకు ఆసుపత్రి వద్ద ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేప ట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఢిల్లీరావుకు చెందిన పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు అమర్చి దానికి హెచ్‌టీ లైన్ కలపడంతో తీవ్రత ఎక్కువైందని, పంట పొలాల్లో అడవి జంతువుల కోసం అమర్చినట్లు తీగలు పెట్టారన్నారు. వాస్తవానికి పంటలు లేని సమయంలో తీగలు అమర్చడం అసాధ్యమని, ఉద్దేశ పూర్వకంగా ఆయనను హత్య చేసి ఇలా తీగల కథ అల్లారని పేర్కొ న్నారు. ఢిల్లీరావును హత్య చేసిన హంతకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: కలమట



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి

ఎల్.ఎన్.పేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్య మని, అందుకు అనుగుణంగానే సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లో మంగళవారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ.. గతంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవే టీకరణ చేసి ఉక్కు స్థలాలను అమ్మేందుకు ప్రయత్నిస్తే.. ఇప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునేందుకు ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు రాబట్టార న్నారు. చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నీటిసంఘం ఉపాధ్యక్షుడు వి.ఆనందరావు, టీడీపీ నేతలు ఎస్.కిశోర్ కుమార్, కె.చిరంజీవి, టి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు కృషితో ఉక్కుకు భరోసా: బగ్గు



నరసన్నపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకే కాకుండా యవత్ రాష్ట్రానికి మణిహారంగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పునరుజ్జీవింపజేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు విశేషంగా కృషి చేశారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేసి ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్‌రెడ్డి ప్రయత్నిస్తే.. చంద్రబాబు దానిని పరిరక్షించేందుకు అహర్నిశలు శ్రమించి కేంద్ర ప్రభుత్వ సాయంతో రూ.11,440 కోట్లతో ఆర్థిక భరోసా కల్పించారన్నారు.

విశాఖ ఉక్కుకు సాయం హర్షణీయం: శిరీష

పలాస, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కుకు సీఎం చంద్రబాబునాయుడు కృషితో కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీకి ఆమోదించడం హర్షణీయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సాయంతో విశాఖ ఉక్కుకు పునరు జ్జీవం కలిగిందన్నారు. ఎందరో త్యాగాల ఫలితంగా సాధించు కున్న ఉక్కు పరిరక్షణకు ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా సహకారం అందించడం చరిత్రలో మిగిలిపోతుందన్నారు. కూటమి ప్రభు త్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఉత్తరాంధ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు.

సీఎం చొరవతోనే ఉక్కుకు జీవం: ఎంజీఆర్

పాతపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు చొరవతోనే విశాఖ ఉక్కుకు జీవం కలుగుతోందని, దీనికి కేంద్రప్రభుత్వం సాయంతోనే ఆర్థిక భరోసా కలిగిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. సంక్షోభంలో ఉన్న విశాఖ ఉక్కును పరిరక్షించేందుకు రూ.11,440 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర మంత్రిమండలి ఆమోదించడం ఆనందంగా ఉందన్నారు. దీంతో ఉత్తరాంధ్ర అభివృద్ధితోను, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఉన్నాయని నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బాబ్జీ, లండ తాతబాబు, బండి రవివర్మ, శాసనపురి మధుబాబు తదితరులున్నారు.

విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

టెక్కలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కుకు సీఎం చంద్రబాబు కృషితోనే కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు విడుదల చేసిందని, దీంతో ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును వైసీపీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయాలని చూస్తే, దానిని పరిరక్షించేందుకు చంద్ర బాబు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నేతలు హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, లవకుమార్, కామేసు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను సక్రమంగా నిర్వహించాలి

కాశీబుగ్గ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను సక్రమంగా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. మంగళవారం కాశీబుగ్గ పాత బస్టాప్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటకాలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. అన్నక్యాంటీన్‌లో భోజనం, తాగునీరు ఉండాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నోడల్ అధికారి ప్రభాకర్ ఉన్నారు.



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

అభివృద్ధిని అడ్డుకోవద్దు

- మండల సమావేశంలో ఎమ్మెల్యే శిరీష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి అభివృద్ధి జరగలేదని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే వాటిని వైసీపీ ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం దారుణమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంగళవారం ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్ష తన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గంలో మందస, పలాస మండలాల నుంచి ప్రజాప్రతినిధులు సకాలంలో తీర్మానాలివ్వడం వల్ల ఆయా మండలాల్లో సీసీ, బీటీ రోడ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. అయితే వజ్రపుకొత్తూరు మండలంలో ఎంపీపీ ఆధ్వర్యంలో ప్రతిపక్ష సర్పంచ్‌లు తీర్మానాలివ్వకుండా వ్యవహరించారన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ జోక్యం చేసుకున్న తరువాత తీర్మానాలివ్వడం వల్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. దీనిపై ఎంపీపీ భర్త, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయకుమార్ మాట్లాడానికి ప్రయత్నించగా ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా ప్రతిదానికి కౌంటర్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తే ఊరు కునేది లేదని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల నియోజకవర్గం అన్ని రకాలా అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకా శాలు పెరుగుతాయన్నారు. అభివృద్ధి పనుల వెనుక రైతుల త్యాగాలున్నాయన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు రైతులు సహకరించాలని, భూములు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామన్నారు. ఈ సమయంలో ఉదయ్‌కుమార్ ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకోవడంతో కొంతసేపు అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీడీవో రమేష్ నాయుడు కలుగజేసుకొని అభివృద్ధి పనులను అడ్డుకుంటే మండలం ముందుకు సాగదన్నారు. ఎంపీటీసీ కొండా సురేఖ మాట్లాడుతూ.. మెట్టూరు పంచాయతీలో ఏ అభివృద్ధి పనులు చేపట్టినా తనకు ఆహ్వానించడం లేదని, భవిష్యత్‌లో ఇలాగే వ్యవహరిస్తే సభలోనే ధర్నా చేస్తానని పేర్కొన్నారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రోత్సాహకాలు: ఎమ్మెల్యే ఎంజీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకో వాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తిడ్డిమి గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు సంవర్ధకశాఖ అధికారులు సూచించే ఆధునిక విధానాలను పాటించడం ద్వారా పాడి పరిశ్రమలో అద్భుతాలు చూడవచ్చన్నారు. టెక్కలి డివిజన్ డీడీ డా.వి.జయరాజ్ మాట్లాడుతూ.. పశుగ్రాస పెంపకాలు, మినీ గోకులాలు తదితర పథ కాలపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కలిగిం చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.సత్యప్రకాశ్, ఏడీ డా. మంచు కరుణాకరరావు, పశువైద్యాధికారులు బి.శ్రీవాణి, అనిల్, మౌనిక, ఎంపీటీసీ కొప్పల గీత, నేతలు పైల బాబ్జీ, తూలుగు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి




న్యాయవాదులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

కోటబొమ్మాళి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, భార్యా భర్తల కేసులతో పాటు వివిధ రకాల కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్య క్రమంలో న్యాయవాదులు లఖినేని శ్రీనివాస్, పల్లి వాసు దేవరావు, వెలమల అప్పలనాయుడు, యండ వెంకటరావు, బి.ధర్మారావు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల భర్తీకి దరఖాస్తులు

కోటబొమ్మాళి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు మండలాల అభ్యర్థులు కోటబొమ్మాళి మండల న్యాయ సేవా సంఘానికి దరఖాస్తులు చేసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా శిక్షణ ఇవ్వను న్నారన్నారు. అనంతరం గ్రామాల్లో న్యాయ సలహాలు, సూచనలు అందించేలా కార్యక్రమాలు రూపొందించబడతాయన్నారు. 18 సంవత్సరాలు నిండి పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. దరఖాస్తుల ను ఫిబ్రవరి 5వ తేదీలోగా అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు మండల న్యాయ సేవా సంఘ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జీవో 117తో పాఠశాల విద్య బలోపేతం



మాట్లాడుతున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

హిరమండలం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యను మరింత బలోపేతం చేసుందుకు జీవో 117ని ప్రభుత్వం తీసుకువస్తోందని జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 117 జీవో రీ ఆర్గనైజేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జీవో వల్ల ప్రతి పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించి బోధనలో మరింత నైపుణ్య విధానాలను తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాళీప్రసాదరావు, తహసీల్దార్ హనుమంతురావు, ఎంఈవో కె.రాంబాబు, గొల్లవాడు తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎల్.ఎన్.పేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 5 ఏళ్లలోపు చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేసేటప్పుడు వైద్యసిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని స్టేట్ సర్వైలెన్స్ మోనటరింగ్ అధికారి జాన్‌జుడె జాషువా అన్నారు. తురకపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కరకవలసలో మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. 5 ఏళ్లలోపు చిన్న పిల్లలున్న ఇళ్లకు వెళ్లి పిల్లల వివరాలను సేకరించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎ.లక్ష్మీదీప్, విమలరావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆధార్ శిబిరాలను వినియోగించుకోండి

టెక్కలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి కోరారు. మంగళవారం టెక్కలి, చాకిపల్లి, లింగాలవలసలో ఆధార్ నమోదును పరిశీలించారు. ఈనెల 24 వరకు తొలివిడత, ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు రెండో విడత ఈ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

పలాస, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీయార్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ (గ్లో) ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గంలో 1000 యూనిట్ల రక్తాన్ని సేకరించడం లక్ష్యంగా పెట్టుకొని ఈ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

టెక్కలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్ అన్నారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ దిశగా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి సిద్ధం చేయాలని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను కోరారు. జేవీవీ జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ.. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, సుస్థిర అభివృద్ధి, మూఢ నమ్మకాలు-శాస్త్రీయ దృక్పథం' అంశాలపై విద్యార్థులు ఇంటి వద్ద ప్రయోగాలు చేసి వీడియో తీసి వాటిని గూగుల్ ఫామ్‌లో ఫిబ్రవరి 15లోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాలవలస ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మందస, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తి స్థాయిలో రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఏపీ రైతుసంఘ జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, మండల కార్యదర్శి ధర్మారావు కోరారు. సీఐటీయూ కార్యాలయం లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, తప్పుడు పద్ధ తులు అనుసరిస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కె.రంగదాసు, కె.ధర్మారావు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వివేకానంద

టెక్కలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని, ఆయన ఆశయాలను ఆచరించాలని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు అన్నారు. స్వామి వివేకానంద జయంతి వేడుకలు తిథి ప్రకారం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస రావు, విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నాయకుడిలా వాదించడం తగదు



వజ్రపుకొత్తూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేకాహ్వానితుడు కేవలం కొన్ని ప్రత్యే క అంశాల పైనే మాట్లాడాల్సి ఉం టుంది కాని ప్రతిపక్ష నేతలా వాదిం చడం తగదని పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేంబాబుచౌదరి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గౌతు శిరీష కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై మాట్లాడుతుండగా ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ కుమార్ అడ్డుతగలడం దారుణమన్నారు. వైసీపీ ప్రజా ప్రతినిధుల తరఫున ఆయన వన్‌మేన్ షో చేస్తే కలెక్టర్, జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ

పోలాకి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఈదులవలస మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం వృత్తి విద్య విద్యార్థుల కోసం ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మంగళ వారం కోర్సు కోఆర్డినేటర్ జి.శంకరరావు, బి.తిరుపతిరావు పరిశీలించారు. పది రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు.

ఆయా పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

టెక్కలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం టెక్కలి, కొత్తూరు, పాతపట్నం ప్రాజెక్టులకు సంబంధించి 21 ఆయా పోస్టుల భర్తీకి ఆర్డీవో కృష్ణమూర్తి ఇంటర్వ్యూ నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ బి.శాంతిశ్రీ, సీడీపీవోలు విమలారాణి, పి.శోభారాణి, విమల కుమారి పాల్గొన్నారు.

పలాసలో..

పలాసరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పీఎంజన్‌మన్‌లో గిరిజన ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాల పోస్టుల భర్తీకి మంగళవారం ఆర్డీవో గ్రంధి వెంకటేష్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో పార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మీరాకేత్రిన్ తదితరులు పాల్గొన్నారు.